జ్వరం.. భయం

- ఒక వైపు ఎండలు.. మరో వైపు వర్షాలు
- వాతావరణ మార్పులతో పెరుగుతున్న సీజనల్ వ్యాధులు
- చిన్నారులు, వృద్ధుల్లో వైరస్ ప్రభావం
- కిక్కిరిసిన ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులు
- జాగ్రత్తలు పాటించాలంటున్న వైద్యాధికారులు



జిల్లా ఆస్పత్రిలోని జీఈ వార్డులో చికిత్స పొందుతున్న డయేరియా పీడితులు

ప్రొద్దుటూరు క్రైం : వాతావరణంలో మునుపెన్నడూ లేని విధంగా తీవ్రమైన మార్పులు కనిపిస్తున్నాయి. ఎండలు ఒక వైపు, మరో వైపు అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. దీని ప్రభావంతో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయి. వర్షా కాలంలోనూ ఈ విధమైన ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ప్రతి ఒక్కరూ అనారోగ్యానికి గురౌతున్నారు. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాల వల్ల పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అవుతున్నాయి. ఖాళీ ప్రదేశాల్లో మురుగునీరు చేరి అపరిశుభ్రత చోటు చేసుకుంటోంది. దీంతో దోమలు వృద్ధి చెందడమే కాకుండా తాగునీరు కూడా కలుషితమయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. వాతావరణ మార్పుల కారణంగా దోమలు వృద్ధి చెంది అనేక ప్రాంతాల్లోని ప్రజలకు మలేరియా, టైఫాయిడ్, డెంగీ తదితర సీజనల్ వ్యాధుల ప్రమాదం పొంచి ఉంది. దీని ప్రభావం వల్ల వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణులు వ్యాధుల బారిన పడే అవకాశం ఏర్పడింది. జ్వరాలతోపాటు డయేరియా కేసులు కూడా అనేక ప్రాంతాల్లో కనిపిస్తున్నాయి. పేద, మధ్యతరగతి ప్రజలు అందుబాటులో ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లగా ఆర్థిక స్థోమత కలిగిన వారు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. డయేరియా, సీజనల్ జ్వరాలను నివారించేందుకు ప్రభుత్వం రెండు నెలల ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. జూలై 1 నుంచి ఆగస్టు 31 వరకు వైద్యాధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించాలని, సురక్షితమైన మంచినీటిని తాగాలని వైద్యాధికారులు కోరుతున్నారు. 5 ఏళ్ల లోపు పిల్లలకు జింక్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందజేస్తున్నారు. ప్రతి హాస్పిటల్‌లో జింక్, ఓఆర్ఎస్ కార్నర్‌ను ఏర్పాటు చేశారు. గ్రామాల్లోని ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను పరిశీలించి శుభ్రం చేస్తున్నారు. హాస్టళ్లు, స్కూళ్లను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య విద్యను బోధిస్తున్నట్లు కామనూరు వైద్యాధికారి శ్రీనివాస్ తెలిపారు.

జ్వరాలతో ఆస్పత్రుల బాట పట్టిన ప్రజలు

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో జిల్లా ఆస్పత్రితోపాటు కామనూరు, కల్లూరు, రాజుపాళెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు ఉన్నాయి. అలాగే ప్రొద్దుటూరులో 6 యూపీహెచ్‌సీలతోపాటు రాజుపాళెం, ప్రొద్దుటూరు మండలాల్లో 33 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. అలాగే ప్రొద్దుటూరులో 40కి పైగా ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. కామనూరు పీహెచ్‌సీలో ప్రతి రోజు 80 మందికి పైగా ఓపీలో చికిత్సలు చేయించుకుంటారు. వీరిలో 10 మంది జ్వరపీడితులు ఉన్నట్లు వైద్యాధికారులు చెబుతున్నారు. కల్లూరు పీహెచ్‌సీలో కూడా పరిసర గ్రామాల ప్రజలు 70 మందికి పైగా ఓపీలో వైద్య పరీక్షలు చేయించుకుంటారు. ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి ప్రొద్దుటూరుతో సహా జమ్మలమడుగు, ముద్దనూరు, ఎర్రగుంట్ల, కమలాపురం, మైదుకూరు, దువ్వూరు, కర్నూలు జిల్లాలోని చాగలమర్రి నుంచి ప్రతి రోజు వైద్య చికిత్స నిమిత్తం వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు. ప్రతి రోజు జిల్లా ఆస్పత్రిలో 1100 వరకు ఓపీ నమోదవుతుంది. వీరిలో వైరస్ కారణంగా 100 మందికి పైగా మలేరియా, టైఫాయిడ్ కేసులు నమోదు అవుతున్నట్లు ఆస్పత్రి రికార్డుల ద్వారా తెలుస్తోంది. వివిధ రకాల వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న వారిని వైద్యులు పరీక్షించి ఆస్పత్రిలోని వార్డుల్లో అడ్మిట్ చేస్తున్నారు. ప్రతి రోజు సుమారు 130 మంది వరకు ఐపీ ఉంటుందని వైద్యులు చెబుతున్నారు.

జ్వరాలు, డయేరియాతో చిన్న పిల్లలు..

జిల్లా ఆస్పత్రిలోని చిన్న పిల్లల వార్డులో ఎక్కువగా అడ్మిషన్‌లు నమోదు అవుతున్నాయి. సుమారు ప్రతి రోజు సుమారు 20 మంది వరకు చిన్న పిల్లలు జ్వరాలు, డయేరియాతో ఆస్పత్రిలో చేరుతున్నారు. రెండు, మూడు రోజుల పాటు చికిత్స అనంతరం వైద్యులు వీరిని డిశ్చార్జి చేస్తున్నారు. ఇంజక్షన్‌లు, టాబ్లెట్‌లతోపాటు సెలైన్ బాటిళ్లు పెట్టి వైద్యం చేస్తున్నారు. వర్షాకాలంలో పిల్లలను డయేరియా ఎక్కువగా ప్రభావితం చేస్తుందని వైద్యులు చెబుతున్నారు. పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి తక్కువగా ఉన్న కారణంగా డయేరియా, ఇతర సీజనల్ వ్యాధుల ఇన్‌ఫెక్షన్‌లకు గురవుతారని అంటున్నారు.

కిటకిటలాడుతున్న ప్రైవేట్ ఆస్పత్రులు

సీజన్ వ్యాధుల కారణంగా వచ్చే వారితో ప్రొద్దుటూరులోని ప్రైవేట్ ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి. ప్రొద్దుటూరుతోపాటు పులివెందుల, కొండాపురం, ముద్దనూరు, జమ్మలమడుగు, కమలాపురం, వీఎన్‌పల్లి, కమలాపురం, కర్నూలు జిల్లాలోని ఆళ్లగడ్డ, చాగలమర్రి ప్రాంతాల నుంచి ప్రజలు వైద్యం చేయించుకునేందుకు ఇక్కడికి వస్తుంటారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో చిన్న పిల్లలు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. రోగ నిర్ధారణ కోసం వచ్చే రోగులతో ల్యాబ్‌లు కూడా కిక్కిరిసి కనిపిస్తున్నాయి. వ్యాధుల బారిన పడిన వారు అటు ఆస్పత్రులతోపాటు ల్యాబ్‌లకు వేలాది రూపాయిలు ఖర్చు చేయాల్సి వస్తోంది.

పిల్లలు డయేరియా, జ్వరాల బారిన పడితే..

డయేరియా, జ్వరాల బారిన పడిన పిల్లల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అతిసారం లేదా డయేరియా అనేది ఏ సమయంలోనైనా ఏ వయసులోనైనా వస్తుంది. ముఖ్యంగా వర్షాకాలంలో పిల్లల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా పిల్లల్లో విరేచనాలు, వాంతులు, పొత్తికడుపులో నొప్పి, మలం వదులుగా రావడం, వికారం, నీరసంగా అనిపించడం తదితర లక్షణాలు కనిపిస్తాయి. కలుషిత ఆహారం, నీరు తాగడం వల్ల అతిసారం వస్తుంది. తగు జాగ్రత్తలు తీసుకుంటే డయేరియా బారి నుంచి పిల్లలను కాపాడవచ్చని వైద్యులు అంటున్నారు. తాజాగా వండిన ఆరోగ్యకరమైన ఆహారం తినడం అవసరమని, పండ్లు, ఆకుకూరలు తినాలని వారు సూచిస్తున్నారు. ప్రేగు ఆరోగ్యం కోసం పెరుగు లాంటి ప్రోబయోటిక్ పదార్థాలను ఆహారంలో చేర్చడం మంచిదని, పిల్లలు హైడ్రేడ్‌గా ఉండేందుకు శుద్ధి చేసిన నీటిని పుష్కలంగా తాగాలనేది వైద్య నిపుణుల సూచన. అలాగే స్ట్రీట్ ఫుడ్, జంక్ ఫుడ్‌లను పిల్లలకు దూరంగా ఉంచాలని చెబుతున్నారు. వర్షాకాలంలో అన్ని వయసుల వారు కాచి చల్లార్చిన నీటిని తాగాలని వైద్యులు అంటున్నారు.

24 గంటల పాటు అందుబాటులో వైద్య సేవలు



జిల్లా ఆస్పత్రిలో 24 గంటల పాటు అన్ని రకాల వ్యాధులకు చికిత్సలు చేస్తున్నాం. వైద్యులు ఎప్పుడూ అందుబాటులో ఉండి, అత్యవసర చికిత్సలు కూడా అందిస్తున్నారు. ఆస్పత్రిలో అన్ని రకాల మందులు ఉన్నాయి. డయేరియా, సీజనల్ జ్వరాల పట్ల ఎక్కువగా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. డయేరియా తీవ్రత చాలా తక్కువగా ఉంది, ప్రజలెవ్వరూ భయపడవద్దు, ఎలాంటి అనారోగ్య లక్షణాలు కనిపించినా వెంటనే ఆస్పత్రికి వచ్చి వైద్య చికిత్సలు చేయించుకోవాలి.

\- డాక్టర్ ఆనంద్‌బాబు, జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్, ప్రొద్దుటూరు

అతిసార వ్యాధి అదుపులో ఉంది



గ్రామాల్లో అతిసార వ్యాధి అదుపులో ఉంది. కడుపులో తీసుకునే ఆహారం ప్రభావం కారణంగా అక్కడక్కడా ఒకటి, రెండు డయేరియా కేసులు వస్తున్నాయి. సీజనల్ జ్వరాలు కూడా తక్కువగానే నమోదు అవుతున్నాయి. గ్రామాల్లో డయేరియా క్యాంపెయిన్ నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. నీరసంగా ఉన్నా, విరేచనాలు అవుతున్నా వెంటనే పీహెచ్‌సీకి రావాలని ప్రజలకు సూచనలు చేస్తున్నాం. ఆస్పత్రిలో మందుల కొరత లేదు, అన్ని మందులు పుష్కలంగా ఉన్నాయి.

\- డాక్టర్ మహాలక్ష్మి, పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్, కల్లూరు

అప్రమత్తంగా ఉండాలి



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. రెండు రోజులకు మించి జ్వరం తగ్గకుంటే వెంటనే పీహెచ్‌సీకి రావాలి. ఆస్పత్రిలో అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. కలుషిత నీరు, ఆహారం తీసుకోవద్దు, వేడి పదార్థాలు, ఆకుకూరలు, పండ్లు తినాలి. సాధ్యమైనంత వరకు కాచి చల్లార్చిన నీటిని తాగాలి.

\- డాక్టర్ శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యాధికారి, కామనూరు

ప్రబలిన డయేరియా



తుడుమలదిన్నెలో వృథా నీటితో ఏర్పడిన మురికి కూపం

ఖాజీపేట : మారిన వాతావరణం కారణంగా నీటి కాలుష్యం అధికమైంది. గ్రామాల్లో పారిశుద్ధ్యం సక్రమంగా లేకపోవడం, పైప్‌లైన్ లీకేజీల కారణంగా విషజ్వరాలు ప్రబలుతున్నాయి. ఏ పల్లె చూసినా డయేరియా (అతిసార వ్యాధి)తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. డయేరియా లేని గ్రామం లేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. సరైన చికిత్స కోసం పట్టణాలకు పరుగులు పెడుతున్నారు. ఖాజీపేట మండలంలో డయేరియా అధికంగా ఉంది. ముఖ్యంగా బాలికల ఉన్నత పాఠశాలలో నీటి కాలుష్యం కారణంగా 70 మంది విద్యార్థినులు ఇబ్బందులు పడి కోలుకున్న తరువాత, కొత్తనెల్లూరు దళితవాడలో ప్రబలింది. తరువాత మిడుతూరులో అధికమైంది. సునీల్ (19) అనే యువకుడు ఇటీవల మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. తాజాగా మండలంలో తుడుమలదిన్నె, పత్తూరు, బుడ్డాయపల్లె, ఆంజనేయకొట్టాలు ఇలా అన్ని గ్రామాల్లో డయేరియా కారణంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

వైద్య సేవల కోసం అవస్థలు

మండలంలో డయేరియా రోగులు అధికం కావడంతో చాలా మంది కడప, ప్రొద్దుటూరు, రిమ్స్‌కు వెళ్లి చికిత్స పొందుతున్నారు. మరికొందరు మైదుకూరు, ఖాజీపేటలోని ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స చేయించుకుంటున్నారు. మిడుతూరు గ్రామంలో మృత్యువాత పడిన సంఘటనతో అందరిలో భయాందోళన నెలకొంది. డబ్బు ఖర్చు అయినా ఫర్వాలేదు అని ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. ఆర్థిక స్థోమత లేని వారు ఖాజీపేట, మిడుతూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో చికిత్స పొందుతున్నారు.

లోపించిన పారిశుద్ధ్యం: గ్రామాల్లో పారిశుద్ధ్యం పూర్తిగా లోపించింది. పేడ దిబ్బలు, మురుగు నీరు ఇళ్ల మధ్యలో గ్రామాల్లో అధికంగా ఉండటం, కాలం చెల్లిన బావుల్లో కలుషిత నీరు ఉండటం, దోమలు అధికమై జ్వరాలకు ప్రధాన కారణం అవుతోంది. పంచాయతీల్లో బ్లీచింగ్ చల్లడం కానీ దోమల నివారణకు మందు పిచికారీ చేయడం కానీ గ్రామాల్లో జరగడం లేదని స్థానికులు అంటున్నారు.

సీజనల్ వ్యాధులపై దృష్టి సారించండి

ఖాజీపేట : గ్రామాల్లో వస్తున్న సీజనల్ వ్యాధులపై దృష్టి సారించి, నివారణకు చర్యలు తీసుకోవాలని ఈఓపీఆర్డీ వెంకటసుబ్బారెడ్డి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సభా భవనంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ఆయన సమావేశం నిర్వహించారు.

పైప్‌లైన్ పనులు పూర్తి చేస్తున్నాం



మిడుతూరు గ్రామంలో వచ్చిన సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించాం. నీటి కాలుష్యంకు కారణమైన పైప్‌లను మార్చి కొత్త పైప్‌లైన్ ఏర్పాటు చేస్తున్నాం. ములపాక నీటి ట్యాంకుల వద్ద క్లోరినేషన్ చేసిన తరువాతే నీటిని విడుదల చేస్తున్నాం. మండలంలో ఎక్కడా సమస్య లేకుండా ప్రత్యేక దృష్టి సారించి పని చేస్తున్నాం.

\- ఉమామహేశ్వర్‌రెడ్డి, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, ఖాజీపేట

కాచి చల్లార్చిన నీటిని తాగాలి



మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా కాచి చల్లార్చిన నీటిని మూడు నెలల పాటు అందరూ తాగాలి. మిడుతూరు పరిధిలో వచ్చిన డయేరియా పూర్తిగా అదుపులోకి వచ్చింది. నాలుగు రోజులుగా వైద్య సిబ్బంది అక్కడే శిబిరం ఏర్పాటు చేసి పూర్తిగా అదుపులోకి తీసుకుని వచ్చాం.

\- డాక్టర్ సుమన్, వైద్యాధికారి, మిడుతూరు

ట్యాంకులను శుభ్ర పరచాలని ఆదేశించాం



మండలంలో డయేరియా సమస్య ఉన్న కారణంగా అన్ని పంచాయతీల కార్యదర్శులకు ట్యాంకులను శుభ్రపరచాలని ఆదేశించాం. నీటి కాలుష్యం ఉంటే వెంటనే నీటిని నిలుపుదల చేయాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించాం. అదే విధంగా పనులు జరుగుతున్నాయి.

\- వెంకటరమణ, ఇన్‌చార్జి ఎంపీడీఓ, ఖాజీపేట

ఆస్పత్రులు కిటకిట



బద్వేలు ప్రభుత్వాసుపత్రిలో బారులు తీరిన రోగులు

బద్వేలు అర్బన్ : పట్టణంతోపాటు ప్రతి పల్లెలో ఎక్కడ చూసినా జ్వరపీడితులే కనిపిస్తున్నారు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు జ్వర పీడితులతో కిటకిటలాడుతున్నాయి. ప్రభుత్వాసుపత్రితోపాటు పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో జ్వరపీడితులు, వాంతులు, విరేచనాల బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. పట్టణంతోపాటు పరిసర గ్రామాల ప్రజలు తండోపతండాలుగా ప్రభుత్వాసుపత్రికి వచ్చి చికిత్స చేయించుకుంటున్నారు. ప్రతిరోజు ప్రభుత్వాసుపత్రిలో 300 నుంచి 400 వరకు ఓపీ జరుగుతుందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆసుపత్రులకు వచ్చే రోగుల్లో అధిక శాతం విషజ్వరాలు, వాంతులు, విరేచనాల బాధితులే ఉంటున్నట్లు వైద్యులు తెలిపారు.

తడిసి మోపెడవుతున్న ఖర్చులు

త్వరగా నయం చేయించుకునేందుకు చాలా మంది ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తుంటారు. ఇందులో ఓపీకి రూ.200, రక్త పరీక్షలకు రూ.300, మందులకు రూ.500 చొప్పున ఒక్కో మనిషికి రూ.వెయ్యి ఖర్చవుతుంది. పల్లెల నుంచి వచ్చే బాధితులకు ఆటో ఖర్చులు మరింత అదనంగా అవుతున్నాయి.

సమన్వయం లోపం

సాధారణంగా జూన్, జూలై మాసాల్లో వర్షాలు పడి పారిశుద్ధ్యం లోపిస్తుంటుంది. ఈ క్రమంలో అటు మున్సిపల్ ఇటు మండల పరిషత్ అధికారులతోపాటు వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుంది. గ్రామాల్లో, వార్డుల్లో పారిశుద్ధ్య పనులు మెరుగుపరచడంతో పాటు తాగునీరు కలుషితం కాకుండా చూడటం, దోమల వ్యాప్తి చెందకుండా చూడటం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంది. అయితే ఆయాశాఖల అధికారులు సమన్వయ లోపం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఇదే సమయంలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఆరోగ్య కేంద్రాలకు, పంచాయతీలకు వచ్చే శానిటేషన్ నిధులు పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

లోపించిన పారిశుధ్యం

అట్లూరు : పారిశుధ్యం లోపంతో ప్రజలు అల్లాడుతున్నారు. మండలంలో 24449 మంది ప్రజలు నివసిస్తున్నారు. ప్రజల ఆరోగ్యబాగోగులు చూసుకునేందుకు ఒక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు 7 ఆరోగ్య ఉపకేంద్రాలు, 6 విలేజ్ క్లినిక్‌లు ఉన్నాయి. గ్రామాలలో పారిశుధ్యం లోపించడంతో ఎక్కడ పడితే అక్కడ వీధుల వెంట నీరు నిల్వ చేరి మురికిగా తయారై దుర్గంధంగా మారుతోంది. మురికిని తొలగించు కార్యక్రమం గానీ, పారిశుధ్య నివారణ చర్యలు గానీ చేపట్టక పోవడంతో దోమలు విజృంభిస్తున్నాయి. దీంతో ఎక్కడ విషజ్వరాలు ప్రబలుతాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అయితే ఇంత వరకూ మండల పరిధిలో విషజ్వరాలు ప్రబలలేదని, ముందస్తుగా పారిశుధ్య నివారణా చర్యలు చేపట్టినట్లు స్థానిక సీహెచ్‌ఓ మురళీకృష్ణా తెలిపారు.

ప్రభుత్వాసుపత్రిలో మందుల కొరత

కాశినాయన : మండలంలోని నరసాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందుల కొరత ఉంది. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్ జ్వరాల బారిన పడిన వారు ప్రభుత్వాసుపత్రికి వెళుతున్నారు. ప్రతి నిత్యం 100 నుంచి 150 మంది దాకా వస్తుంటారు. అక్కడ కొన్ని రకాల జబ్బులకు మందుల కొరత ఏర్పడింది. లేని వాటిని డాక్టర్లు బయట కొనుక్కోమని చెబుతుంటారని ప్రజలు వాపోతున్నారు. సెలైన్ బాటిళ్లు ఎక్కించే ఐవీ సెట్స్ కూడా ప్రభుత్వాసుపత్రిలో లేవు. 'మీకు సెలైన్ ఎక్కిస్తాము. ఐవీ సెట్ బయట తెచ్చుకోవాల'ని వైద్యాధికారులు చెబుతున్నారు. దీంతో చేసేదేమీ లేక బయట తెచ్చుకుని సెలైన్ ఎక్కించుకుంటున్నారు. వర్షాకాలం కావడంతో గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు అవగాహన కల్పించిన దాఖలాలు లేవు. ఇప్పటికైనా జిల్లా వైద్యాధికారులు స్పందించి మందుల కొరత లేకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

జాగ్రత్తలు పాటించాలి



వాతావరణంలో మార్పుల కారణంగా పట్టణంతో పాటు పల్లెల్లో సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. ఇందుకోసం ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు కాచి చల్లార్చిన నీటిని తాగడం, వేడి ఆహార పదార్థాలు తీసుకోవడం ఉత్తమం. ఆసుపత్రుల్లో అన్నిరకాల వైద్య పరీక్షలు, మందులు అందుబాటులో ఉన్నాయి.

\- డాక్టర్ రాంప్రసాద్, డిప్యూటీ సివిల్ సర్జన్, ప్రభుత్వాసుపత్రి, బద్వేలు

తాగినీటి కలుషితంతో..

బి.కోడూరు : మండలంలో ఐత్రంపేట, మున్నెల్లి, రామసముద్రం, పాయలకుంట్ల, తంగేడుపల్లె, మేకవారిపల్లె, పెద్దుళ్ళపల్లె తదితర గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించి వ్యాధులు ప్రబలుతున్నాయి. గతంలో ఎప్పుడో నిర్మించిన ఓవర్‌హెడ్ ట్యాంకు, డైరెక్ట్ పంపింగ్ స్కీంల పైపుల నుంచి నీరు లీకేజీ అయి కలుషితమై ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఏ గ్రామంలో కూడా జ్వరాల బారిన పడిన జ్వరపీడితులు కనిపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు చొరవ చూపి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రహ్మంసాగర్ పరిశీలన

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంసాగర్ రిజర్వాయర్‌లో నీటిమట్టం గణనీయంగా పడిపోవడంతో బద్వేలు తాగునీటి అవసరాల కోసం బద్వేలు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి మంగళవారం పంప్‌హౌస్‌ను పరిశీలించారు. బద్వేలుకు తాగునీటి ఇబ్బందులు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలని అనే దానిపై సాగర్‌ను పరిశీలించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నందిపల్లె విశ్వశాంతి హైస్కూల్ కరస్పాండెంట్ బొమ్ము కృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, శ్యామసుందర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పరామర్శ

చాపాడు : మండలంలోని లక్ష్మీపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా ఉపాధ్యక్షులు కర్నాటి నారాయణరెడ్డిని మంగళవారం ఏపీఎస్ ఆర్టీసీ మాజీ జోనల్ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పరామర్శించారు. ఇటీవల కర్నాటి నారాయణరెడ్డి కాలు ఆపరేషన్ చేయించుకుని లక్ష్మీపేటలోని తన ఇంటిలో విశ్రాంతి తీసుకుంటున్నారు.

ఖాజీపేట : పుల్లూరు పంచాయతీలోని కోటం గురువాయపల్లెకు చెందిన గణేశం రమణారెడ్డిని రెడ్యం వెంకటసుబ్బారెడ్డి పరామర్శించారు. ఇటీవల రమణారెడ్డి చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో కాలుకు ఆపరేషన్ చేయించుకున్నారు.

18న కో-ఆపరేటివ్ స్టోర్స్ మహాజన సభ

ప్రొద్దుటూరు: స్థానిక కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ కార్యాలయంలో ఈనెల 18న గురువారం ఉదయం 11 గంటలకు మహాజన సభ నిర్వహించనున్నట్లు అధ్యక్షురాలు గజ్జల కళావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు జరిగిన జమా ఖర్చులు, లావాదేవీలను పరిశీలించి ఆమోదించుట, పాలకవర్గ సభ్యులు తీర్మానాలను ర్యాటిఫై చేయుట తదితర అంశాలపై చర్చించి ఆమోదిస్తారని ఆమె పేర్కొన్నారు. స్టోర్స్ సభ్యులందరు మహాజనసభకు హాజరు కావాలని కోరారు.

పోలేరమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



పోలేరమ్మ ఆలయంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, నాయకులు

బ్రహ్మంగారిమఠం : బ్రహ్మంగారిమఠంలోని కొలువైన పోలేరమ్మను ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, తులసమ్మ దంపతులు, బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ మంగళవారం దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాశినాయన మండలం సావిశెట్టిపల్లె వైఎస్సార్ సీపీ నాయకులు ఎలిచర్ల నాగసుబ్బారెడ్డి, బి.మఠంలో ప్రైవేట్ స్కూల్ యజమాని ఎలిచర్ల రమణారెడ్డిల కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన అమ్మవారి బోనాలకు వచ్చిన సందర్భంగా వారు విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ పంచాయతీరాజ్ రాష్ట్ర సలహాదారురు నాగార్జునరెడ్డి, వైఎస్సార్ సీపీనాయకుడు, ఏపీఎస్ ఆర్టీసీ జోనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, బద్వేల్ మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రమణారెడ్డి, పోరుమామిళ్ళ సర్పంచ్ సుధాకర్, బి.మఠం ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మేకల రత్నకుమార్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు అర్బన్ : స్థానిక ఎన్‌జీవో కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సుధతో బద్వేలు మున్సిపాలిటీ, అట్లూరు మండలాలకు చెందిన పలువురు నాయకులు సమావేశమయ్యారు. పట్టణంతోపాటు ఆయా గ్రామాలకు చెందిన వివిధ రకాల సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మున్సిపాలిటీ నాయకులు కేశవరెడ్డి, రమేష్ బాబు, చెన్నకృష్ణారెడ్డి, రఘురామిరెడ్డి, అట్లూరు మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, మత్స్యసహకార సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పోరుమామిళ్ళ (అట్లూరు) : పోరుమామిళ్ళ పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు, మాజీ మార్కెట్ యార్డు డైరెక్టర్ ధనిశెట్టి ఓబయ్య భార్య ఈ నెల 13వ తేదీన గుండెనొప్పితో మరణించడం జరిగింది. మంగళవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ఓబయ్య ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించండి

మైదుకూరు : రైతాంగ సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం మైదుకూరు మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మండల వ్యవసాయాధికారి లక్ష్మీప్రసన్నకు వినతి పత్రం అందజేశారు. నూతన ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా సాగు సాయం రూ.20 వేలు వెంటనే రైతున్న ఖాతాలో జమ చేయాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం సాగు సాయం కింద ఎకరానికి రూ.15 వేలు అందజేస్తోందని, అదే విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎకరానికి రూ.15 వేలు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కల్తీ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎమ్మార్పీకే నాణ్యమైన మందులు అందుబాటులో ఉండేలా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోతిరెడ్డి భాస్కర్, జిల్లా అధ్యక్షుడు చిలుంగారి పెద్ద పుల్లయ్య, జిల్లా సమితి సభ్యులు గోశెట్టి రామ్మూర్తి, మైదుకూరు నియోజకవర్గ, మండల కమిటీ నాయకులు ఎస్.సుబ్బారెడ్డి, కత్తి నాగిరెడ్డి, కొమ్మినేని చెన్నయ్య, కొట్టే రామ్మోహన్, కొమ్మినేని లక్ష్మయ్య, ధనపాలనారపుశెట్టి పాల్గొన్నారు.

ఘనంగా పెద్ద సరిగెత్తు

రాజుపాళెం : మొహర్రం వేడుకల్లో భాగంగా మండలంలోని టంగుటూరు గ్రామంలో మంగళవారం రాత్రి పెద్ద సరిగెత్తును ఘనంగా నిర్వహించారు. చిన్న పీర్లతోపాటు బాబా ఫక్రుద్దీన్‌స్వామి పీరును బ్రహ్మయ్య, మరి కొంత మంది యువకులు ఎత్తుకొని వీధుల్లో ఊరేగించారు. అర్కటవేముల గ్రామంలో జీవన్నస్వామి పీరును ఊరేగించారు.

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో పీర్లను కొలువు దీర్చి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక సుందరాచార్యుల వీధి, నడింపల్లెలోని పీర్లచావిడిలలో పీర్లను కొలువుదీర్చి పూలతో అలంకరించారు. కొందరు డప్పు వాయిద్యాల మధ్య పీర్లను పురవీధుల్లో ఊరేగింపు చేశారు.

పోరుమామిళ్ళ (అట్లూరు) : పోరుమామిళ్ళ పట్టణంలో పీర్లచావిడి వద్ద కొలువు దీరిన పీర్లకు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఆయనను ముస్లిం, మైనార్టీ పెద్దలు శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు ముత్యాలప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు రాజశేఖర్, సి.బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీవ్‌బాషా, మాజీ ఉప సర్పంచ్ రాళ్ళపల్లి నరసింహులు, ఎంపీటీసీలు గురప్ప, మాబుపీరా, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

■ పోరుమామిళ్ళ పట్టణంలోని పీర్లచావిడికి రామాయపల్లె పిడుగువారిపల్లె వంశస్తులు మౌలాలి, పెద్దపీరయ్య స్వామి వారికి మంగళవాయిద్యాలతో గంధం, స్వామివారికి పూజా సామగ్రితో అత్యంత వైభవంగా బయలుదేరి సమర్పించారు.

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె, ప్రభలవీడు, పెద్దుళ్ళపల్లె తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

డ్రగ్ కంట్రోల్ ఆఫీస్ ఏర్పాటు చేయండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న మెడికల్ అసోసియేషన్ సభ్యులు

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరులో ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ కార్యాలయాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని కోరుతూ హోల్‌సేల్ మెడికల్ అసోసియేషన్ సభ్యులు మంగళవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి వినతి పత్రం అందచేశారు. ఇక్కడ 150కి పైగా మెడికల్ ఏజెన్సీలు, మెడికల్ షాపులు, రెండు బ్లడ్ బ్యాంక్‌లు, 100కు పైగా ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయని వారు ఎమ్మెల్యేకు వివరించారు. డ్రగ్ కంట్రోల్ ఆఫీసు ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు యం. చంద్రశేఖర్, జిల్లా అసోసియేషన్ కార్యదర్శి కె.వెంకటేశ్వర్లు, ప్రొద్దుటూరు అసోసియేషన్ కార్యదర్శి టి.శివప్రసాద్, ఉపాధ్యక్షుడు ద్వారకనాథ్, కోశాధికారి కె.సుబ్బరాయుడు, సహాయ కార్యదర్శి పి.జనార్ధన్, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.